క్లుప్తంగా

గ్రామాల్లో వైద్యసేవలు



పుల్లానారాయణపల్లిలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: పుల్లానారాయణపల్లి, భీమరాయునిపేట గ్రామాల్లో శనివారం వైద్య సిబ్బంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, జబ్బులు ఉన్న వారికి బీపీ, షుగర్, రక్తం, మూత్ర పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్ఎన్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రజలు వైద్యం కోసం మండల కేంద్రానికి లేదా విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లకుండా గ్రామాల ముంగిటకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ సుహాసిణి, ఏఎన్ఎం లక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



దాతను సత్కరిస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చింతా ఈశ్వరయ్య, చింతా వెంకటలక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారుడు చింతా శ్రీనివాసులు శిబిరం నిర్వహణకు సహకరించారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు 146 మందికి కంటి పరీక్షలు చేసి 110 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారందరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు పోతులయ్య

ధర్మవరం రూరల్: మండలంలోని దర్శినమల గ్రామానికి చెందిన పోతులయ్య(44) అనే కూలి ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలు.. పోతులయ్య రెండు రోజుల క్రితం ధర్మవరంలో పాత ఇంటిని తొలగించడానికి కూలి పనికోసం వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



ఏకపాదంపల్లి సమీపంలో బోల్తా పడిన లారీ

తాడిమర్రి: ఏకపాదంపల్లి సమీపంలో శనివారం లారీ బోల్తా పడిన ఘటనలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ధర్మవరం నుంచి మట్టిలోడుతో వెళుతున్న లారీ ఏకపాదంపల్లి సమీపంలోని బస్టాప్ వద్ద వెళ్లగానే తాడిపత్రి వైపు నుంచి ధర్మవరం వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. అయితే లారీలోని డ్రైవర్, క్లీనర్ చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరక్కుండా బయట పడటంతో అక్కడ ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా ఏకపాదంపల్లి బస్టాప్ సమీపంలో రోడ్డుపై గుంతలు పటడం, రోడ్డు మలుపు ఉండటంతో తరచుగా లారీలు, బస్సులు, ఐచర్లు, ద్విచక్ర వాహనాలు బోల్తా పడుతున్నారు. ఈ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత సైతం పడ్డారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్ష..నేలకు రక్ష

- నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాలను బట్టి ఎరువుల వినియోగంతో ఖర్చులు తగ్గుముఖం
- అధిక దిగుబడులకు అవకాశం

ధర్మవరం రూరల్: భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేయడం లాభదాయకం. రైతులు పొలంలో భూసార పరీక్షలు చేయించడం వల్ల అందులో వున్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు ఇతర సమస్యలు తెలుస్తాయి. దీంతో స్థానిక రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయాధికారులు సిఫారసు మేరకు సిబ్బంది ఎప్పటి కప్పుడు రైతులకు సాగు భూమిలో ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవచ్చో తెలియజేయడం వల్ల అనవసర వ్యయం గణనీయంగా తగ్గుతోంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకొని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వినియోగిస్తుండడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడు భారడంతో పాటు చీడ పీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట కోతలు పూర్తయిన తరువాత వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలను సేకరించాలి. పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలను సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు గట్లు, చెట్లు వున్న ప్రాంతంలో మట్టి నమూనాలను తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి. వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పై పార నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు 8 ప్రదేశాల్లో సేకరించిన మట్టిని బాగా కలిపి అర కేజీ బరువు వచ్చేలా తీసుకొని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తరువాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలను నమోదు చేసి పరీక్షా కేంద్రాలకు తరలించాలి. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో ఆరు అంగుళాల లోతు నుంచి నమూనాలను సేకరించాలి. పండ్ల తోటలకు అడుగుల లోతుతో ప్రతి అడుగుకు ఒక నమూనా, అలాగే చౌడు, ఆమ్ల నేలల్లో అడుగులోతుతో ప్రతి 8 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.



పొలంలో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారి ముస్తఫా



సేకరించిన మట్టిని ప్రయోగ శాలకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

పోషకాల స్థాయిపై పక్కా లెక్క

వ్యవసాయ క్షేత్రంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయనక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు ఆ నేలలో ఉన్న పోషకాలు స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా చేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు ఎంతో ప్రయోజనం



భూ సార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చు.

– ముస్తఫా, వ్యవసాయాధికారి, ధర్మవరం

టీడీపీ నాయకుల అరాచకాలు అరికట్టండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కదిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు,కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు చేస్తున్న దాడులను అరికట్టాలను ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ ఇంచార్జ్ బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషాతో పాటు నాయకులు జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4 నుంచి కదిరి నియోజకవర్గంలో కొందరు టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తూ అలజడులు సృష్టించడంతో పాటు సామాన్యుల సైతం భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. పదేపదే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పోలీసులు వెంటనే విచారణ చేపట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, నాయకులు పరికి సాదిక్ బాషా, లీగల్ సెల్ లోకేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఫైజుల్లా, నూరుల్లా, జెడ్పీటీసీ సభ్యుడు క్రిష్ణానాయక్, కౌన్సిలర్ రామ్‌ప్రసాద్, షాను, కలాం తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైస్ ఎంపీపీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట



వైస్ ఎంపీపీ గంగరాజును పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ నేతలు, కార్యకర్తల ఆగడాలు ఎక్కువయ్యాయని, వారి చేతుల్లో దాడులకు గురైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ బోయ గంగరాజును అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎన్నికల ఫలితాల రోజున దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన అనంతపురం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఆసుపత్రికి చేరుకుని గంగరాజు ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అధైర్యపడొద్దు అండగా ఉంటానని భరోసా కల్పించారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహంతో దాడులు చేయడాన్ని ఖండించారు. గంగరాజు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా తనపై దాడి చేయగా చేయి విరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత రెడెప్పరెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు నారాయణ స్వామి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు



గత ఏడాది రాప్తాడు మండలంలో సాగు చేసిన కొర్ర పంట (ఫైల్)

కనగానపల్లి: వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా దృష్టి పెడుతున్నారు. ఇందులో ముఖ్యంగా కొర్ర, పెసర, జొన్న వంటి చిరు ధాన్యాల పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కనగానపల్లి, రాప్తాడు, రామగిరి మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు కొర్ర పంటను సాగుచేసి మంచి దిగుబడులు సాధించారు. తక్కువ వర్షాలు వచ్చినా ఎట్టకు తట్టుకుని 90 రోజుల్లో కొర్ర పంట చేతికి వస్తుంది. ఈ కొర్ర పంట సాగుకు పెట్టుబడులు కూడా చాలా తక్కువ. ఎకరానికి రూ.5 వేల పెట్టుబడి కూడా రాదని, పంట సాగు చేసినప్పుడు విత్తనం, సేద్యం ఖర్చులకు కలపి రూ.3 వేల వరకు వస్తుందని రైతులు చెబుతున్నారు. తిరిగి పంటను తొలగించే సమయంలో కూలీల ఖర్చులు రూ.2 వేల వరకు వస్తాయి. ఈ పంట సాగుకు ఎకరానికి మూడు కేజీల విత్తనం సరిపోతుంది. ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదు. దీనికి అడవి పందులు, జింకల బెడద ఉండదు. పంట సాగు చేసిన తర్వాత కేవలం రెండు వర్షాలు పడినా మంచి దిగుబడి వస్తుంది. కలుపు మొక్కలు లేకుండా బాగా సేద్యం చేసుకొంటే ఎకరానికి ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి రావొచ్చు. మార్కెట్లో కొర్ర ధాన్యానికి క్వింటాల్ ధర కనీసం రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఉంటుంది. ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా రూ.15,000 వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడులు, కూలీల ఖర్చుల పోనూ ఎకరానికి రూ.15,000 వరకు లాభం ఆర్జించొచ్చని రైతులు చెపుతున్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

ఎన్పీకుంట: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీధర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించవద్దని, వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా నడుచుకోవద్దని సూచించారు. చట్టపరిధిలో అందరూ సమానమేనని, చట్టపరిధిలో ఉన్న పరిష్కార మార్గాలను అనుసరించి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు ఎప్పటిలాగే పోలీసులకు సహకరించాలని, ఎక్కడైన అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

ఎంపీటీసీ బైక్ అపహరణ

చిలమత్తూరు: మండల కేంద్రంలో శుక్రవారం చిలమత్తూరు–3 ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డికి చెందిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు అపహరించారు. బాధితుడి వివరాల మేరకు..ఎంపీటీసీ రాఘవేంద్ర రెడ్డి శుక్రవారం మండల కేంద్రంలోని ఓ పశువుల దాణా కేంద్రం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఉంచి అనంతపురం వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి 10 గంటలకు రాగే వాహనం కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాల చోరీలు ఎక్కువగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఫిర్యాదులు అందినా వాటి గురించి పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. వివరాలు.. కియా పోలీసులు తెలిపిన మేరకు..బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు.. పెనుకొండ 44వ జాతీయ రహదారిపై కోతాస్ కాఫీ షాపు ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనింది. దీంతో వెంకటగిరిపాళ్యానికి చెందిన వడ్డీ గంగాధర్ అనే వృద్ధుడు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వృద్ధుడిని పోలీసులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు అనంతపురం తరలించారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు గాయాలు

కనగానపల్లి: మండల పరిధిలోని మామిళ్లపల్లి సమీపంలో కనగానపల్లి రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కనగానపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంలో ఒక యువకుడు వేగంగా వస్తున్నాడు. మామిళ్లపల్లి గ్రామానికి సమీపంలోకి రాగానే నర్సరీల వద్ద రోడ్డు పక్కన నిలిపిన మరో ద్విచక్ర వాహనంతో పాటు పక్కనే నిలబడి ఉన్న శోభా అనే మహిళను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శోభ కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్టార్టర్ చోరీ

చిలమత్తూరు: కొడికొండ పంచాయతీ బలిజపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీరామరెడ్డి పొలంలోని రూ.15 వేలు విలువ చేసే బోరు స్టార్టర్ చోరీకి గురైంది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిచిన తర్వాత కొడికొండ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కక్ష పూరితంగా తన మోటారు స్టార్టర్ టీడీపీ కార్యకర్తలే ఎత్తుకెళ్లి ఉంటారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశారు. మనుషులకు రక్షణ లేదని, వ్యవసాయమే జీవనాధారంగా జీవించే తమకు ఇలా స్టార్టర్లు ఎత్తుకెళితే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

వర్షానికి నేలకొరిగిన చెట్టు



పాఠశాలలో కూలిన చెట్టు

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం తెల్లవారుజామున కురిసిన గాలివానకు చెట్టు కూలింది. పాఠశాల కార్యాలయం పక్కన ఉన్న చెట్టు కూలిన విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు వెంటనే చెట్టును అక్కడి నుంచి తొలగింపజేశారు. తనకల్లు రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు బాలసముద్రం అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు భారీగా చేరడంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామిని దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్ రెడ్డి వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రతి శనివారం నిర్వహించే భజన, అన్నదాన కార్యక్రమాలకు నాగిరెడ్డిపల్లికి చెందిన శ్యామ్ సుందర్ రూ.10 వేలు, అలాగే మదనపల్లికి చెందిన బొమ్మిశెట్టి ఉదయ్ కుమార్, పూజిత దంపతులు రూ.5 వేలు విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్‌కు అందజేశారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపుర సుందరి సమేతా ఓంకారేశ్వర ఆలయంలో అమర కార్తికేయ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, నాయకులు తాళ్లూరు సతీష్‌కుమార్, నెట్టెం రమణ చిన్నారులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ అమర్నాథ్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి

తాడిమర్రి: ఏకపాదంపల్లి, నార్శింపల్లి గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయా ఆలయాల్లోని పూజారులు స్వామి మూలవిరాట్‌లకు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే తాడిమర్రి, నిడిగల్లు గ్రామాల్లోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాల్లో కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.